సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 26 । జూలై । 2024



విస్తృతంగా తనిఖీలు

మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు విస్తృతం చేశారు. 8లో



నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి హెచ్చరించారు. 8లో



కలప స్వాధీనం

కొయ్యూరు సెక్షన్ పరిధిలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన నల్లమద్ది కలపను రేంజర్ స్వాధీనం చేసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్


నేడు ప్రాథమిక పాఠశాలలకు సెలవు

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు: వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటిస్తూ గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలిచ్చారు. జిల్లాలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్న ఆశ్రమ, ఉన్నత, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో మాత్రం ఈనెల 26వతేదీ శుక్రవారం నుంచి తరగతులు నిర్వహించాలని ఆయన సూచించారు. చింతూరు డివిజన్‌లోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు మాత్రం తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు సెలవులు కొనసాగించాలని ఆయన ఆదేశాల్లో పేర్కొన్నారు.

డొంకరాయికి వరద తాకిడి

- రూ.2,200 క్యూసెక్కుల విడుదల



డొంకరాయి జలాశయం నుంచి విడుదల అవుతున్న వరదనీరు

మోతుగూడెం : జల విద్యుత్ కేంద్రాలకు నీరందించే లోయర్ సీలేరు డొంకరాయి జలాశయానికి వరద తాకిడి కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో బుధవారం అర్ధరాత్రి ఒక గేటు ద్వారా రెండు అడుగులు ఎత్తి 2,200 క్యూసెక్కుల నీటిని జెన్‌కో అధికారులు దిగువకు విడుదల చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

సక్రమంగా పారిశుధ్య పనులు

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశం



గన్నవరంలో ముంపు బాధితులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ్

ఎటపాక: గోదావరి వరద ముంపు గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్ ఆదేశించారు. గురువారం ఆయన నెల్లిపాక, టీపీవీడు, గన్నవరం పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల వద్ద అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముంపు గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శేఖర్ ఉన్నారు.

కొనసాగుతున్న వర్షాలు


- జిల్లావ్యాప్తంగా 205.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



గొడుగులను ఆశ్రయించిన గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. గురువారం కూడా ఉదయం నుంచి రాత్రి వరకు పాడేరుతో పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తూనే ఉంది.ప్రదాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గత ఆరు రోజులుగా సెలవులు ప్రకటించడంతో విద్యాసంస్థలు మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా గురువారం 205.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జి.మాడుగులలో 44.6, ముంచంగిపుట్టులో 34.2, పెదబయలులో 28.8, డుంబ్రిగుడలో18.4, పాడేరులో17, హుకుంపేటలో15.2, అరకులోయలో14.4, చింతూరులో 7.3, మారేడుమిల్లిలో 6.4,అనంతగిరిలో 4.8, జీకేవీధిలో 4, కూనవరంలో 2.6, కొయ్యూరులో 1.8, ఎటపాక 1.4,అడ్డతీగల 1.2,రాజవొమ్మంగి 1,రంపచోడవరం 1, వీఆర్‌పురం ఒక మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది.

తాటిగుడ ఉరకలు



అనంతగిరి : ఏజెన్సీ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు ఉరకలేస్తుండగా.. మరోవైపు ఎటుచూసినా పచ్చదనం కనువిందు చేస్తోంది. మండలంలోని తాటిగుడ జలపాతం పచ్చని పొలాల మధ్య బండరాళ్లపై జాలువారుతూ చూపరులను ఆకట్టుకుంటోంది.

కష్టాల సుడిలో సాగుతూ..

అన్నదాతకు భరోసా లేకుండా పోయింది. గత ప్రభుత్వంలో ప్రతి రైతుకు ఏటా పెట్టుబడి సాయం రూపేణా మూడు విడతలుగా మొత్తం రూ.15,500 వారి ఖాతాల్లో జమ అయ్యేది. ఎన్నికల సమయంలో దీనిని రైతు నేస్తం పేరిట రూ.20 వేలకు పెంచుతామని ప్రకటించిన చంద్రబాబు ఇప్పటి వరకు ఆ ఊసెత్తలేదు. దీంతో సాగు పెట్టుబడికి అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని గిరి రైతులు వాపోతున్నారు.

సాయం ఊసే లేదు



నా పేరు రేగం బొంజుబాబు, మాది పాడేరు మండలం గురిపల్లి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేంద్రం నుంచి రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.9,500 మా ఖాతాల్లో జమ అయ్యేది. ప్రభుత్వం మారింది. మాకు భరోసా లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.2 వేల పీఎం కిసాన్ సాయమే ఇప్పుడు ఆధారమైంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సాయం ఊసెత్తడం లేదు.

- అన్నదాతకు అందని పెట్టుబడి సాయం
- రూ.20 వేలకు పెంపు హామీని అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- నేటికీ రైతు ఖాతాల్లో జమకాని వైనం
- చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు
- సాగు కోసం తప్పని అప్పులు



హుకుంపేట మండలం తీగలవలస ప్రాంతంలో దమ్ము పనుల్లో నిమగ్నమైన రైతులు

సాక్షి,పాడేరు: ఖరీఫ్ సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా.. వ్యవసాయం పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం రాయితీపై సరఫరా చేసిన వరి విత్తనాలతో రైతులు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. పెట్టుబడి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం పేరిట విడుదల చేస్తామన్న రూ.20 వేల కోసం ఎంతో ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.

దుక్కి చేసి..

జిల్లా వ్యాప్తంగా ఏటా ఖరీఫ్‌లో 58 వేల హెక్టార్లలో రైతులు ఖరీఫ్‌లో వరిని సాగు చేస్తుంటారు.ఈ ఏడాది కూడా తొలకరి వర్షాలు సకాలంలో కురవడంతో వారు ముందుగానే దుక్కి పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన 23,840 క్వింటాళ్ల వరి విత్తనాలతో చేపట్టిన నారుమడులు నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. నాట్లు, ఎరువులు వేసేందుకు పెట్టుబడి కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ వారు తిరుగుతున్నారు. ఎకరాకు దుక్కి, దమ్ము, ఎరువులు, నాట్లకు రూ.20 వేలు పెట్టుబడి అవసరమని వారు తెలిపారు.

దిక్కుతోచక..

గత ప్రభుత్వంలో జిల్లాలో పెట్టుబడి సాయం నిమిత్తం ఒక్కొక్కరికి రూ.15,500 చొప్పున రైతు భరోసా కింద ఏటా రూ.1,69,264 మందికి లబ్ధి చేకూరేది. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడికి తొలివిడతగా రూ.7.500 జమ చేసేది. ఈ సొమ్ముతో ధీమా సాగుకు సిద్ధమయ్యేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రైతు భరోసాను రైతు నేస్తంగా మార్చిన ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభమై దాదాపుగా నెల రోజులు గడుస్తున్నా ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో రైతులకు దిక్కుతోచడం లేదు.

బ్యాంకులు, వ్యాపారుల చుట్టూ.. : ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రైతు నేస్తం జమ అవుతుందని రైతులంతా ఎదురుచూశారు. ఇక కష్టమేనని భావించిన రైతులు ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు అందే పరిస్థితి కనిపించడం లేదు. వ్యాపారులు నూటికి రూ.3 నుంచి రూ.5 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. సాగుపై ఆశతో కొంతమంది రైతులు వారి నుంచి అప్పు తీసుకుని పెట్టుబడికి వినియోగిస్తున్నారు.

అప్పుల కోసం తిరుగుతున్నాం



నా పేరు వంతాల అప్పలనాయుడు. మాది అరకులోయ మండలం బస్కి. ఈ ప్రభుత్వంలో వ్యవసాయం చేయాలంటనే భయమేస్తోంది. ఇప్పటివరకు రైతు నేస్తం పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం జమ చేయలేదు. వ్యవసాయ పెట్టుబడులకు గాను అప్పులు కోసం తిరాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్యాంకులు కూడా వ్యవసాయ రుణాలు ఇంకా ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో వ్యవసాయానికి సకాలంలో పెట్టుబడి సాయం అందేది.ఈ ఏడాది మాత్రం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం.

ఖర్చులు పెరిగిపోయాయి



గత ప్రభుత్వ హయాంలో ఈ పాటికే రైతు భరోసా సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ అయ్యేది. వేన్నీళ్లకు చన్నీళ్లు తోడైనట్టుగా ఆ సొమ్ము పెట్టుబడికి ఎంతో సాయంగా ఉండేది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత నేటికి అందలేదు. సాగు పెట్టుబడి ఖర్చులు కూడా బాగా పెరిగాయి. ప్రభుత్వం సకాలంలో భరోసా సొమ్ములు అందజేస్తే ఎంతో సాయం చేసినట్టు అవుతుంది.

– కేదారి రాజుబాబు.
రైతు, అప్పలరాజుపేట, రాజవొమ్మంగి మండలం

సాగుకు అనుకూల వాతావరణం



జిల్లాలో సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పుష్కలంగా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు 30 శాతం మేర మాత్రమే వరినాట్లు జరిగాయి. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలను ఆర్‌బీకే సిబ్బంది అందిస్తున్నారు.

– ఎస్‌బీఎస్ నందు,
జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

సహాయక చర్యలు ముమ్మరం

- ప్రత్యేకాధికారి సూరజ్ గనోరే ఆదేశం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సూరజ్ గనోరే

కూనవరం: వరద బాధితుల సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ప్రత్యేకాధికారి, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డివిజనల్ పంచాయతీ అధికారుల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ముంపు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ఎక్కడికక్కడ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డివిజనల్ పంచాయతీ అధికారులు రఘునందన్, కుమార్, తహసీల్దార్ ఆర్‌వీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



పాడేరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

సాక్షి,పాడేరు: చారిత్రాత్మక కార్గిల్ యుద్ధానికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నేతలు గురువారం రాత్రి జిల్లా కేంద్రం పాడేరులో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ విజయ్ దివాస్ పేరిట 65 మీటర్ల జాతీయ జెండాతో పాటు కాగడాల ప్రదర్శన చేపట్టారు. యువతలో కార్గిల్ యుద్ధ స్ఫూర్తి నింపేలా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కాఫీబోర్డు డైరెక్టర్ కురుసా ఉమామహేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, బీజేవైఎం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గెమ్మెలి కొండబాబు, పాంగి మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌పై చర్యలకు రంగం సిద్ధం

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో అక్రమ వసూళ్లపై మరోసారి విచారణ

సాక్షి ఎఫెక్ట్..



చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో విచారణ నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ నీలవేణిదేవి

చింతపల్లి రూరల్: జనన ధ్రువపత్రాల జారీకి అక్రమ వసూళ్లకు పాల్పడిన చింతపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు రంగం సిద్ధమవుతోంది. అనధికార ఉద్యోగులతో నగదు వసూలుపై ఈనెల 18న 'పైసా వసూల్' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు స్పందించారు. దీనిపై ఇప్పటికే వైద్యవిధాన పరిషత్ జిల్లా కోర్డినేటర్ కృష్ణారావు ఇటీవల విచారణ నిర్వహించారు. ఆ సమయంలో సూపరింటెండెంట్ లేనందున డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు రెండోసారి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి విచారణ నిర్వహించారు. బాధితులతో ఆమె మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆమె సాక్షితో మాట్లాడారు. జనన ధ్రువపత్రాల జారీకి నగదు వసూలు చేసినట్టు వైద్యులు నిర్ధారించారన్నారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించే విషయంతో కొంత మొత్తం వసూలు చేసినట్టు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె వెల్లడించారు. గురువారం విచారణకు హాజరుకాని వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఒకరోజు వేతనం నిలిపివేయాలని కార్యాలయ సూపరింటెండెంట్‌ను నీలవేణిదేవి ఆదేశించారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- ఏడీఎంహెచ్‌వో శిరీష
- జడ్డంగి పీహెచ్‌సీలోని అంబులెన్సుకు మరమ్మతులు



రాజవొమ్మంగి పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో శిరీష

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీలో రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష పేర్కొన్నారు. గురువారం ఆమె జడ్డంగి, రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను సందర్శించారు. ల్యాబ్, లేబర్ రూం, వార్డులను ఆమె పరిశీలించారు. వైద్యసేవలు ఏ విధంగా అందుతున్నదీ ఆరా తీశారు. మందుల నిల్వలు, ప్రసవాల వివరాలను తెలుసుకున్నారు. బర్తివెయిటింగ్ రూంలో వేచి ఉండే గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారం అందుతున్నదీ లేనిది పరిశీలించారు. ఇటీవల జడ్డంగి పీహెచ్‌సీలో మృతి చెందిన ఓ గిరిజన మహిళ మృతదేహాన్ని అంబులెన్సు అందుబాటులో లేకపోవడంతో స్థానిక యువకులు మోటార్ సైకిల్‌పై తరలించడంపై ఆమె స్పందించారు. అంబులెన్సుకు మరమ్మతులు చేయించి వెంటనే అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఏజెన్సీలోని అన్ని పీహెచ్‌సీల్లో అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ఆమె వెంట వైద్యాధికారులు యామినప్రియ, సుష్మ ఉన్నారు.

గర్భిణికి సత్వర వైద్యం

- సిజేరియన్ చేసి కాపాడిన వైద్యనిపుణులు
- తల్లీబిడ్డ క్షేమం



కూతలగుట్ట సీహెచ్‌సీలో గర్భిణికి శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

కూనవరం: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి మండలంలో కోతులగుట్టు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో గురువారం సాయంత్రం సత్వర వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడారు. గోదావరి వరదల నేపథ్యంలో మండల పరిధి గ్రామాల్లోని గర్భిణులను ముందస్తు చర్యల్లో భాగంగా కూనవరం సీహెచ్‌సీ(కోతులగుట్ట)కి తరలించారు. ఈక్రమంలో కూనవరంలోని ఉదయ భాస్కర్ కాలనీకి చెందిన బర్ల శ్రావణికి గురువారం పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. ఆమెకు సిజేరియన్ చేయాల్సిన అవసరం ఉందని గుర్తించిన వైద్యులు తక్షణమే భద్రాచలం, చింతూరు, రంపచోడవరం తరలించాలని భావించారు. అయితే రహదారులపై చుట్టూ వరదనీరు ఉండటంతో తరలించేందుకు సాధ్యపడలేదు.ఆమె ప్రాణాపాయ పరిస్థితిని గుర్తించిన జనరల్ సర్జన్ డాక్టర్ మహేష్‌బాబు వెంటనే స్పందించారు. ఆయన నేతృత్వంలో గైనకాలజిస్ట్ పి.శ్వేత, రంపచోడవరం ఎనస్థీషియా వైద్యురాలు పద్మావతి, సీనియర్ వైద్యులు డాక్టర్ శేషురెడ్డి బృందం ఆమెకు సిజేరియన్‌చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. వరద సమయంలో గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కలెక్టర్ దినేష్‌కుమార్, డీసీహెచ్ వైద్యనిపుణులను పంపించడం వల్ల శస్త్రచికిత్స విజయవంతంగా చేయగలిగామని ఆయన పేర్కొన్నారు.

శాంతించిన శబరి.. పెరుగుతున్న గోదావరి

- మళ్లీ రెండవ ప్రమాద హెచ్చరిక జారీ
- వరద ఉధృతి తగ్గే అవకాశం: కేంద్ర జలవనరులశాఖ
- వాగుల నీరు తగ్గడంతో తెలంగాణకు వాహన రాకపోకలు ప్రారంభం
- కుయిగూరు వాగు ఉధృతితో జలదిగ్బంధంలోనే ఒడిశా మార్గం



పడవపై వెళ్లి నందిగామ వద్ద విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు



చింతూరు మండలం మల్లెతోటలో వరద బాధితులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఎటపాక: శబరి నది శాంతించగా.. గోదావరి వరద ఉధృతి మళ్లీ పెరుగుతుండటం విలీన మండలాల ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. బుధవారం సాయంత్రం 45.02 అడుగుల వద్ద నిలకడగా ఉన్న గోదావరి గురువారం ఉదయం నుంచి క్రమేపీ పెరుగుతూ మధ్యాహ్నం 12 గంటలకు 48 అడుగులకు చేరుకుంది. దీంతో రెండవ ప్రమాద హెచ్చరికను మధ్యాహ్నం 12 గంటలకు జారీ చేశారు. స్వల్పంగా వరద పెరుగుతూ సాయంత్రం 6గంటలకు 48.60 అడుగులకు చేరింది. అయితే శుక్రవారం ఉదయానికి నిలకడగా మారి క్రమంగా తగ్గుముఖం పడుతుందని కేంద్ర జలవనరులశాఖ అధికారులు వెల్లడించారు.

చింతూరు: శబరినది ఉధృతి క్రమేపీ తగ్గుముఖం పట్టింది. చింతూరు వంతెన వద్ద గరిష్ఠంగా 41.6 అడుగులకు చేరిన నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ గురువారం రాత్రికి 37 అడుగులకు చేరుకుంది. చింతూరు మండలం చట్టివద్ద జాతీయ రహదారి–30 పై వరదనీరు పూర్తిగా తొలగడంతో గురువారం ఉదయం నుంచి ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు వాహన రాకపోకలు ప్రారంభమయ్యాయి. చింతూరు నుంచి కూనవరం మండలానికి కూడా రాకపోకలు మొదలయ్యాయి. అయితే కుయిగూరు వాగు ఉధృతి తగ్గకపోవడంతో ఈ ప్రాంతం నుంచి ఒడిశాకు ఇంకా రాకపోకలు ప్రారంభం కాలేదు.

- చంద్రవంక, సోకిలేరు, జల్లివారిగూడెం, చీకటి వాగుల నీరు రహదారులపైనే ఉన్నందున చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు జరగలేదు. చింతూరు మండలంలోని 25 గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి.

చింతూరు: వరద బాధితులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన సహాయక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన చింతూరు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలైన ఏజీకొడేరు, ఉలుమూరు, మల్లెతోట గ్రామాల్లో పర్యటించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఆయన వారికి నిత్యావసరాలు, కూరగాయలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రతీ మండలానికి ఐఏఎస్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించామన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి ప్రతిపాదనలు

మల్లెతోట, ఉలుమూరు గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. నదీ పరివాహక గ్రామాల ప్రజలు ఇంకా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులుంటే కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏఎస్పీ రాహుల్ మీనా, తహసీల్దార్ నజీముల్లాషా పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

వ్యాధులు ప్రబలకుండా వరద ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని, నీటిద్వారా సంక్రమించే వ్యాధుల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుంచి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి వచ్చేనెల 10 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై వివిధ శాఖల అధికారులతో మండల, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే నిర్వహించాలని, నీటికుంటల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని, నీటినిల్వలు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి తులసి, డీఎల్పీవో కుమార్ పాల్గొన్నారు.

ముంపుగ్రామాల్లో సబ్‌కలెక్టర్ పర్యటన

వీఆర్‌పురం: వరద ముంపు గ్రామాల్లో ప్రత్యేకాధికారి రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ గురువారం పర్యటించి బాధితులతో మాట్లాడారు. బోట్ ద్వారా శబరి పరివాహకంలోని వరద ముంపు గ్రామాలైన సున్నంవారిగూడెం, చింతరేగుపల్లి, చిన మట్టపల్లి , గుండుగూడెం, తుష్టివారిగూడెం, ఏపీగూడెం ,రామవరం తదితర గ్రామాల్లో సహాయక చర్యలను ఆయన పరిశీలించారు. పోలవరం పరిహారం ఇప్పించి తమను ఇక్కడినుంచి తరలించేలా చర్యలు చేపట్టాలని వరద బాధితులు సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్, సీఐ డి.రామారావు, ఎంపీపీ కారం లక్ష్మి, వెలుగు ఏపీఎం కిషోర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నెల్లిపాక వద్ద గోదావరి వరద నీటి ముంపులో పొలాలు



రేఖపల్లిలోని రిలీఫ్ సెంటర్‌లో గుడారాలు వేసుకుంటున్న వడ్డిగూడెం వరద బాధితులు



చింతూరు మండలం చట్టి, కుమ్మూరు మధ్య రహదారిపై చంద్రవంక వాగు వరదనీరు



వరదనీరు తొలగడంతో ఆంధ్రా, తెలంగాణ మధ్య జాతీయ రహదారిలో నడుస్తున్న వాహనాలు



చింతరేగుపల్లిలో వరద బాధితులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



చింతూరు మండలం ఏజీకొడేరులో వరద బాధితులకు టార్పాలిన్ అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

క్లుప్తంగా

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- స్త్రీశిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి

రాజవొమ్మంగి: విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్త్రీశిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి హెచ్చరించారు. గురువారం ఆమె స్థానిక ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు తిరిగి ఇంటికి క్షేమంగా చేరే వరకు సంబంధిత టీచర్, సూపర్‌వైజర్ బాధత వహించాల్సి ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని, కిందిస్థాయి సిబ్బంది సక్రమంగా పనిచేయకపోతే లక్ష్యం నీరుగారిపోతుందన్నారు. విధుల్లో అలసత్వం సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని శరభవరం, శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు. స్టాక్ రూంలో నిల్వలను పరిశీలించారు. ఆమె వెంట సీడీపీవో దేవమణి ఉన్నారు.

విస్తృతంగా తనిఖీలు


పెద్దగెడ్డ వద్ద తనిఖీ చేస్తున్న బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు

వై.రామవరం: ఈనెల 28 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు మావోయిస్టు వారోత్సవాలు నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా వై.రామవరం నుంచి సరిహద్దు ప్రాంతానికి వెళ్లే ప్రధానరహదారిలోని తూములు, అనుమానాస్పద ప్రదేశాలను ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం బాంబు స్క్వాడ్ తనిఖీ చేసింది.

చింతపల్లి రూరల్: మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం పెద్ద గెడ్డ తదితర ప్రాంతాల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్‌లు క్షుణ్ణంగా పరిశీలించాయి.

వంతెన నిర్మాణ పనులు వేగవంతం


బిరిగూడలో వంతెన పనులను పరిశీలిస్తున్న పీవో అభిషేక్


కిముడుపల్లి గ్రామంలో పర్యటిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

- వంతెన పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి
- చుట్టుగొంది వంతెనకు రూ.50లక్షలు
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో పీవో సుడిగాలి పర్యటన

ముంచంగిపుట్టు: మండలంలో జరుగుతున్న వంతెనల నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని శివారు లక్ష్మీపురం పంచాయతీల్లో గురువారం ఐటీడీఏ పీవో అభిషేక్ సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని సుత్తిగూడ, ముత్తగుమి, బిరిగూడ వాగులపై పీఆర్ ప్రాజెక్టు ద్వారా రూ.3.55కోట్లతో నిర్మించనున్న వంతెనలను ఆయన పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పనులు వేగవంతం చేసి డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాలకు కొట్టుకుపోయిన బుంగాపుట్టు పంచాయితీ చుట్టుగొంది కల్వర్టును పరిశీలించారు. చుట్టుగొంది వద్ద వంతెన నిర్మాణానికి రూ.50లక్షలు నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం కర్లాపోదర్ వాగుపై ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో నిర్మించనున్న వంతెన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డను పరిశీలించారు. సర్పంచ్ రమేష్ వంతెన నిర్మించాలని పీవోను కోరారు. దీనిపై తక్షణమే పీవో అభిషేక్ స్పందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం మత్స్యగెడ్డను దాటేందుకు బోట్లు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ వంతెనలను సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు చేయాలని ఆదేశించారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ వరద ముంపు గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

విద్యార్థులకు భోజనం వడ్డించిన పీవో

మండలంలోని లబ్బూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను ఐటిడిఏ పివో అభిషేక్ సందర్శించారు.పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంపై పాఠాలను బోధించారు. వర్క్‌బుక్స్‌ను పరిశీలించి, పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం మెనూను పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని పీవో వడ్డించారు. మెనూ అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో సమస్యలపై తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో బాలుర పాఠశాల–1ను, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు పోషకాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ డీడీ వై.కొండలరావు, ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ రఫీజాన్, పంచాయితీరాజ్ ఏఈ మురళీ, టీడబ్ల్యూ ఏఈ జబ్బర్, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, సీడీపీవో వరహాలమ్మ, డీటీ అప్పలస్వామి తదితరులున్నారు.

వంతెనల నిర్మాణానికి చర్యలు

పెదబయలు: పెదబయలు, పాడేరు మండలాలను కలుపుతున్న పరదానిపుట్టు, చేదుపుట్టు కాజ్‌వేలపై హై లెవెల్ వంతెనలు నిర్మిస్తామని పాడేరు ఐటిడిఏ పీవో వి.అభిషేక్ అన్నారు. గురువారం పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డపై కాజ్ వేను పరిశీలించారు. కాజ్‌వే ఎత్తు తక్కువగా ఉండడం వలన వరదనీరు పొంగి ప్రవహించడంతో స్థానిక గ్రామస్తులకు ఇబ్బంది కలుగుతుందని పరిశీలించారు. కిముడుపల్లి పంచాయతీ చేదుపుట్టు కాజ్‌వేపై కూడా హై లెవెల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కాజ్‌వేలపై హై లెవెల్ వంతెనల నిర్మాణం జరిగితే వర్షాకాలంలో గ్రామస్తులకు ఇబ్బందులు ఉండదన్నారు. కిముడుపల్లిలో డీఆర్ డిపోను తనిఖీ చేశారు. డిపో భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రామంలో వేరే భవనంలో డిపో మార్పు చేయాలని, జీసీసీ అధికారులకు ఆదేశించారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

హుకుంపేట: బాల్య వివాహాలు అనర్థమని, వాటికి దూరంగా ఉండాలని , ఆడపిల్లలు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని, అన్ని రంగాల్లో ముందు ఉండాలని, విజయాలు సాధించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి చెప్పారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న మిషన్ శక్తి 100 రోజులు కార్యక్రమంలో భాగంగా సమాజంలోస్త్రీ పాత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. సీడీపీవో బాలచంద్రమణి దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కలప స్వాధీనం

కొయ్యూరు: కొయ్యూరు సెక్షన్ కాకరపాడు ఫారెస్ట్ బీట్ పరిధిలోని బాలారం సమీపంలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పది నల్లమద్ది ముక్కలను పట్టుకున్నట్టు పెదవలస రేంజర్ శివరజని తెలిపారు.

ఈ సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ పరిధిలోని కాకరపాడు గ్రామ శివారులో ఉన్న కలప ముక్కలను స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.45వేలు ఉంటుందని అంచనా వేశారు. వాటిని కాకరపాడు కలప డిపోకు తరలించామన్నారు. కలప అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో నూకరాజు, సిబ్బంది రమణ, భూషణం,నాగేశ్వరరావు, గోపి తదితరులున్నారు.

పోక్సో కేసు నమోదుతో ఆత్మహత్యాయత్నం

- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడి మృతి

మద్రిపాలెం(విశాఖ): పోక్సో కేసు నమోదుతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మైనర్లయిన అక్కాచెల్లెళ్లను వేధింపులకు గురి చేసిన కంచరపాలెం వాడపేటకు చెందిన రోహిత్ రెడ్డిపై ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. అదే ప్రాంతానికి చెందిన అక్కాచెల్లెళ్లను నిత్యం వేధింపులకు గురిచేస్తుండడంతో వారి తల్లి పుష్పలత ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రోహిత్ అదే రోజు అర్ధరాత్రి తన ద్విచక్రవాహనంపై తిమ్మాపురం చేరుకున్నాడు. తన బైకులోని పెట్రోల్‌ను బాటిల్‌లోకి నింపి.. ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. త ర్వాత పోలీసులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో రోహిత్ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: విశాఖ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని సీఈవో ఎం.పోలినాయుడు గురువారం ఓ ప్రకటనలో కోరారు. అన్ని శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సిద్ధం కావాలన్నారు.

ఎట్టకేలకు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

సీహెచ్‌సీలో అందుబాటులోకి వచ్చిన అల్ట్రాసౌండ్ పరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..


ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో జరుగుతున్న అల్ట్రాసౌండ్ పరీక్షలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని స్థానిక సీహెచ్‌సీలో కొద్ది రోజులుగా గైనకాలజిస్ట్ లేక గర్భిణులకు అల్ట్రాసౌండ్ పరీక్షలు నిలిచిపోవడంపై ఈనెల 6న సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆరోగ్య శాఖాధికారులు స్పందించారు. ప్రతి గురువారం సీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు చేసేందుకు గైనకాలజిస్ట్‌ను నియమించారు. ఈ మేరకు సీహెచ్‌సీలో గురువారం గైనకాలజిస్ట్‌లు డాక్టర్ కాశివిశ్వనాథం, డాక్టర్ పోలినలు 27 మంది గర్భిణులకు అల్ట్రాసౌండ్ పరీక్షలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కె.గీతాంజలి మాట్లాడుతూ గర్భిణులకు ప్రతి గురువారం అల్ట్రాసౌండ్ పరీక్షలు జరుగుతాయని,గ్రామాల్లో వైద్య సిబ్బంది ద్వారా అల్ట్రాసౌండ్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. మళ్లీ సీహెచ్‌సీలో అల్ట్రాసౌండ్ పరీక్షలు జరగడం పట్ల గర్భిణులు హర్షం వ్యక్తం చేశారు.

వరద బాధితులకు సాయమందించాలి

చింతూరు: వరద చుట్టుముట్టడంతో రహదారి సౌకర్యం లేక ఇబ్బందులకు గురైన గ్రామాలకు చెందిన ప్రజలకు కూడా బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు అందించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి కోరారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వరద ముంపునకు గురైన ప్రజలకు ఇస్తున్న మాదిరిగానే రహదారులు ముంపునకు గురైన గ్రామాల వారికీ కూడా సరకులు ఇవ్వాలని ఆయన కోరారు. చింతూరు మండలంలో భారీ వర్షాలు, వరదల కారణంగా రామన్నపాలెం, చిన్నసీతనపల్లి, పెదశీతనపల్లి, బొడ్రాయిగూడెం, కొండపల్లి, వేగితోట, కన్నాయిగూడెం, కంసులూరు, గవళ్లకోట, చదలవాడ, చౌలూరు, మిట్టవాడ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. దీంతో గత వారం రోజులుగా నిత్యావసరాలు లేక ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడతున్నారని, వారికి వెంటనే రేషన్ సరకులు, కూరగాయలతో పాటు టార్పాలిన్లు ఇవ్వాలని ఆయన అధికారులను కోరారు.

సహకార సంఘాల బలోపేతంపై దృష్టి

- ప్రతీ మండలంలో పెట్రోల్ బంకుల నిర్వహణ
- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విశాఖ విద్య : సహకార సంఘాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. డీసీసీబీ మహాజన సభ గురువారం మద్రిపాలెంలో గల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని డీసీసీబీ కార్యకలాపాలపై సుదీర్ఘంగా చర్చించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.1.6 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు బ్యాంకు సీఈవో డి.వి.ఎస్.వర్మ మహాజన సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటం ద్వారానే వాటిని బలోపేతం చేయటం సాధ్యమవుతుందన్నారు. బ్యాంకులు, సహకార సంఘాల బాధ్యులు ఇందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డీసీసీబీకి అనుబంధంగా ఉన్న బ్యాంకులు ఆర్థిక కార్యకలాపాలను విస్తృతం చేయాలన్నారు. సహకార సంఘాల ద్వారా ప్రతీ మండలంలో పెట్రోల్ బంకుల నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ఆర్థికాభివృద్ధిలో భాగంగా ఎరువుల విక్రయశాలలు, జన ఔషధ కేంద్రాలు, ఎం.పి.ఎఫ్.సీ గోదాములు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ అందిపుచ్చుకోవాలన్నారు. బ్యాంకుల కంప్యూటరీకరణ సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. కంప్యూటరీకరణతో సేవలు మరింత సులభతరం అవుతాయని, అదేవిధంగా డీసీసీబీ కార్యకలాపాలు మరింత పారదర్శకత ఉంటుందన్నారు. బ్యాంకుల పరిధిలో అవసరాలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలను నిర్వహించటం ద్వారా ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈవో డి.వి.ఎస్.వర్మ, అనకాపల్లి జిల్లా సహకార శాఖ అధికారి ప్రేమ స్వరూపరాణి, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు త్వరలో రెండు జనరల్ కోచ్‌లు



తాటిచెట్లపాలెం: భువనేశ్వర్ – ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి మధ్య నడుస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ నుంచి మరో రెండు జనరల్ కోచ్‌లను అదనంగా జత చేయనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సాధారణ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించేందుకు ఈ కోచ్‌లను పెంచుతున్నట్లు తెలిపారు. భువనేశ్వర్–ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబరు 17 నుంచి, ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబరు 15 నుంచి ఈ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జత చేస్తున్నట్లు వివరించారు.

విజయీభవ..


సాగరతీరంలో జాతీయ జెండాలతో క్రీడాభిమానులు

విశాఖ స్పోర్ట్స్(విశాఖ): పారిస్‌లో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న విశ్వ క్రీడావేదికపై భారత జాతీయ పతాకం రెపరెపలాడాలని విశాఖ క్రీడాభిమానులు ఆకాంక్షించారు. ఈ సారి ఒలింపిక్స్ పోటీలకు దేశం నుంచి 117 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా.. తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురు తమ ప్రతిభ చూపేందుకు సిద్ధమయ్యారు. వీరిలో విశాఖకు చెందిన జ్యోతి యర్రాజి వుమెన్ వంద మీటర్ల హార్డిల్స్‌లో, బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ సింగిల్స్‌లో సత్తా చాటేందుకు బరిలో దిగుతున్నారు. సాత్విక్ రాజ్ మెన్ డబుల్స్‌లో, ధీరజ్ మెన్ రికర్వ్ ఆర్చరీలో, టీటీలో ఆకుల శ్రీజతో పాటు జ్యోతిక శ్రీ వుమెన్ నాలుగువందల మీటర్ల రిలేలో జట్టుగా పోటీపడుతున్నారు. విశాఖ క్రీడాభిమానులు గురువారం సాగరతీరంలో జాతీయ జెండాలు ప్రదర్శించి.. క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విజయం సాధించి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఒలింపిక్స్‌లో విజయాన్ని ఆకాంక్షిస్తూ సంతకాల సేకరణ

నర్సీపట్నం: ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, ఆల్ ది బెస్ట్ ఆఫ్ ఇండియా కార్యక్రమం ద్వారా స్థానిక గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న మనదేశ క్రీడాకారులకు సంతకాల సేకరణతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు ప్రతిభ చూపి మనదేశ కీర్తిని నలుదిశలా వ్యాపింపజేస్తారని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. ఎంఈవోలు నాగేంద్ర,వరహాలబాబు మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో మనక్రీడాకారులు సత్తా చాటాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్ మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో ఇచ్చే పతకాల ప్రాముఖ్యతను వివరించారు. విశ్రాంత అధ్యాపకులు యలమంద, విశ్రాంత ఎంపీడీవో శ్రీరామరాజు, విశ్రాంత గ్రంథాలయ అధికారులు కె.త్రిమూర్తులరెడ్డి, మురళీకృష్ణ ఒలింపిక్స్ ఆవశ్యకత గురించి వివరించారు. జాతీయ స్థాయి పోటీల్లో వెండి పతకం సాధించిన చెట్టుపల్లి జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయిని జి.దేవిని సత్కరించారు. విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు, యువతీ, యువకులు సంతకాల ద్వారా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

‘నవోదయ’ పిలుస్తోంది

- 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 16 చివరి తేదీ
- వచ్చే జనవరి 18న ప్రవేశ పరీక్ష


స్మార్ట్ క్లాస్‌రూమ్


కొమ్మాదిలోని నవోదయ ప్రాంగణం

కొమ్మాది(విశాఖ): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమ విద్యనందిస్తున్న ప్రభుత్వ రంగ విద్యాసంస్థ జవహర్ నవోదయ విద్యాలయం . ఇక్కడ చదువుతోపాటు ఐఐటీ ప్రవేశ పరీక్షకు శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు తదితర అంశాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ విద్యాలయంలో చదివే ప్రతి ఒక్కరికీ బంగారు భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రుల నమ్మకం. దీంతో ఈ విద్యాలయంలో ప్రవేశం పొందేందుకు తీవ్ర పోటీ నెలకొంది. పక్కా ప్రణాళిక, కఠోరమైన సాధన చేస్తే తప్ప ఈ విద్యాలయంలో 6వ తరగతిలో సీటు సాధించలేం. ఇక్కడ విద్యాభ్యాసం ఎలా ఉంటుంది, దైనందిక కార్యక్రమాలు, వసతి, భోజన సౌకర్యాలు తదితర అంశాలపై ఓ లుక్ వేద్దాం.

కొమ్మాది నవోదయ విద్యాలయం.. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో విద్యనందిస్తున్న సంస్థ. ఈ పాఠశాలలో చేరేందుకు ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో మూడు, నాలుగో తరగతి చదివి.. ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. 80 సీట్లలో రూరల్ ప్రాంతాల విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం కేటాయిస్తారు. ఈ స్కూలులో చేరేందుకు 100 మార్కులతో కూడిన ప్రవేశ పరీక్ష ఉంటుంది. మేధాశక్తి పరీక్షకు 50 మార్కులు, గణిత పరీక్షకు 25 మార్కులు, భాషా పరీక్షకు 25 మార్కులు ఉంటాయి.

అందుబాటులో అన్ని సౌకర్యాలు

విద్యార్థులు తమ అవసరాల కోసం బయటకు వెళ్లనవసరం లేదు. అన్నీ విద్యాలయంలోనే అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు అనారోగ్యానికి గురైనా ప్రాంగణంలోనే ప్రత్యేక మెడికల్ రూమ్‌లో స్టాఫ్ నర్స్ ద్వారా ప్రాథమిక చికిత్సను అందిస్తారు. మరింత మెరుగైన చికిత్స అవసరమైతే నగరంలోని ఆస్పత్రుల్లో వైద్యసేవలందిస్తారు. విద్యార్థులకు దుస్తులు, షూ, రెండు జతల స్పోర్ట్స్ దుస్తులు, బెడ్ షీట్, టవల్, పుస్తక సామగ్రితో పాటు విద్యార్థికి కావాల్సిన అన్ని వసతులు ఉచితమే.


వాలీబాల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అత్యుత్తమ విద్యాబోధన

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రతిభావంతులైన విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ.. సాంకేతిక విద్యను అందిస్తారు. శాంసంగ్ సౌజన్యంతో 41 ల్యాప్‌టాప్‌లు ఏర్పాటు చేసి.. ప్లాస్మా టీవీ, హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యంతో డిజిటల్ విధానంలో బోధిస్తున్నారు. ఉత్తమ సంస్కృతి విలువలను పెంపొందించడం, పర్యావరణంపై అవగాహన, క్రీడలు, వ్యాయామ విద్యలో శిక్షణ, హిందీ, ఆంగ్లం, తెలుగు భాషల్లో తగిన నైపుణ్యాలను పెంపొందించడం, వలస విద్య (మైగ్రేషన్) విధానం ద్వారా హిందీ రాష్ట్ర విద్యార్థులను హిందీయేతర రాష్ట్రాలకు పంపించి జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించడం, వ్యాసరచన, వ్యక్తృత్వ, క్విజ్, గీతాలాపన, చిత్రలేఖనం, సాంఘిక నాటకాల ప్రదర్శన తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ, వివిధ క్రీడల్లో పోటీల నిర్వహణ, వారంలో ఓ రోజు విద్యార్థులకు ఇంటర్ హౌస్ పోటీల నిర్వహణ , బాలికల స్వీయరక్షణకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ, శాస్త్రీయ, జానపద నృత్యాలపై అభిలాష ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. 10 వేల పుస్తకాలతో ఏర్పాటు చేసిన అధునాతన గ్రంథాలయం అందుబాటులో ఉంది.

వసతి సౌకర్యం ఇలా..

తరగతి గదిలో బాలురు, బాలికలు కలసి చదువుకుంటారు. వసతి, భోజనశాలలు వేర్వేరుగా ఉంటాయి. ఉపాధ్యాయులే అదనపు బాధ్యత తీసుకుని వార్డెన్‌గా వ్యవహరిస్తారు. 16 మంది ఉపాధ్యాయ బృందంలో రోజుకు 8 మంది చొప్పున పనిచేస్తూ వారి యోగక్షేమాలు పర్యవేక్షిస్తారు.

జనవరిలో ప్రవేశ పరీక్ష

జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26లో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు 2013 మే1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలి. https:// navodaya. gov. in/ nvs/en/ Home1 వెబ్‌సైట్‌ను సందర్శించి.. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. 2025 జనవరి 18వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుంది.